ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -73 పేజీలు - 05 వెల - 04/- ఆదివారం 22 మార్చి 2026

# శ్రీవారి పవిత్రతే ప్రధాన లక్ష్యం

## తిరుమలలో సీఎం చంద్రబాబు

సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం కోసం టెక్నాలజీ వినియోగించాలని ఆదేశం

లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు స్పష్టం

టీటీడీ ద్వారా రూ.750 కోట్లతో 5 వేల నూతన ఆలయాల నిర్మాణ ప్రణాళిక

పేదలకు వైద్య సేవలు అందించే ప్రాణదానం కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచన






**తిరుమల,మార్చి 21 ఆంధ్ర ప్రగతి**

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టిటిడి బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా **మిగతా 2లో...**

# ఇరాన్ అణు కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి

## టెహరాన్, బీరుట్ నగరాలపై ఉధృత దాడులు



**టెహరాన్, టెల్ అవీవ్, మార్చి 21 ఆంధ్ర ప్రగతి**

ఇరాన్‌లోని నటాంజ్ అణు కేంద్రంపై శనివారం దాడి జరిగింది. అధికార ఇరాన్ వార్త సంస్థ కూడా ఈ దాడిని ధృవీకరించింది. అయితే అణు ధార్మికత ముప్పు లేదని వెల్లడించింది. ఈ దాడులను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. శనివారం తెల్లవారుజామున టెహరాన్‌పై భారీగా వైమానిక దాడులు కొనసాగాయని స్థానిక ప్రజలు తెలిపారు. తక్షణ కాల్పుల విరమణ మాత్రమే కాకుండా, యుద్ధాన్ని శాశ్వతంగా, సంపూర్ణంగా, సమగ్రంగా ముగించడానికి చర్యలు తీసుకోవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి పేర్కొన్నారు. టెహరాన్, బీరుట్ నగరాలపై శనివారం ఇజ్రాయిల్ భీకరంగా దాడులు కొనసాగించింది. గత మూడు వారాలుగా సాగుతున్న ఈ దాడుల్లో ఇప్పటివరకు **మిగతా 2లో...**

# ఎల్పీజీ కేటాయింపు పెంచుతున్నాం...

హోటళ్లకు ఇవ్వండి: రాష్ట్రాలకు కేంద్రం లేఖ

వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లలో అదనంగా 20 శాతం కేటాయించేందుకు ఆమోదం

హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్న కేంద్రం

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియం శాఖ కార్యదర్శి లేఖ



2లో.



# తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

## ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

**హైదరాబాద్,మార్చి 21 ఆంధ్ర ప్రగతి**దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **మిగతా 2లో...**

# పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కి పెంపు..

సానుకూలంగా ప్రభుత్వం!

ప్రతిపాదనకు కేబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయ అంగీకారం

రాష్ట్రవ్యాప్తంగా 8,500 మందికి లబ్ధి చేకూరే అవకాశం

త్వరలో ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్




2లో.

# నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

23న శంకుస్థాపన చేయనున్న సిఎం చంద్రబాబు

కేంద్రమంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు రాక

రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మాణం




# ఏపీలో త్వరలోనే నంది అవార్డుల పునఃప్రారంభం

కీలక వివరాలు వెల్లడించిన మంత్రి కందుల దుర్గేశ్

కళాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ

విశాఖను సినిమా హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటన

చిరంజీవి వ్యాఖ్యల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న నిర్ణయం



# యుద్ధం ముగిస్తాం

యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం

సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం

ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్

ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత



**వాషింగ్టన్,మార్చి 21 ఆంధ్ర ప్రగతి**

యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. **మిగతా 2లో...**

# 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు: కేటీఆర్

**మార్చి 21 ఆంధ్ర ప్రగతి**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కేవలం మాటలకే పరిమితం చేయకుండా, వాటికి చట్టబద్ధమైన హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ దూకుడు పెంచింది. ఈ అంశానికి సంబంధించి ఈరోజు తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు**మిగతా 2లో...**



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

మొదటిపేజీ తరువాయి



అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు. ఇక, హైదరాబాద్ నగరం సైతం రంజాన్ వేడుకలకు సిద్ధమైంది. ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు ముస్లిం సోదరులు. చరిత్రాత్మక మక్కా మసీదులో రంజాన్ వేడుకలు ఇవాళ(శనివారం) ఉదయం 10గంటలకు ప్రారంభంకానున్నాయి. మక్కా మసీదులో భారీ సంఖ్యలో ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ ప్రార్థనలు చేయనున్నారు. పాతబస్తీలో రద్దీని దృష్టిలో ఉంచుకుని మక్కా మసీదు పరిసరాల్లో వాహనాల రాకపోకలపై ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. మక్కా మసీదులో ప్రత్యేక ఈద్ ప్రార్థనలు, భారీ ఇఫ్తార్ విందుల కోసం పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. అలాగే మీరాలం ట్యాంక్ వద్ద ఉన్న ఈద్గాకు పెద్ద సంఖ్యలో ముస్లింలు చేరుకుంటున్నారు. మరికొద్దిసేపట్లో సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. మీరాలం ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, క్విక్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌లతో భద్రతను ఏర్పాటు చేశారు. రద్దీ నేపథ్యంలో మీరాలం పరిసర ప్రాంతాల్లోనూ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉండనున్నాయి. ఈనెల 19న నెలవంక కనిపించకపోవడంతో భారతదేశంలో రంజాన్ పండుగను శనివారం జరుపుకుంటున్నారు.

# ఎల్పీజీ కేటాయింపు పెంచుతున్నాం...

## హోటళ్లకు ఇవ్వండి: రాష్ట్రాలకు కేంద్రం లేఖ

**మార్చి 21 ఆంధ్ర ప్రగతి**

వాణిజ్య సిలిండర్లపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వాణిజ్య సిలిండర్లను అదనంగా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించడానికి చర్యలు చేపట్టిన కేంద్రం, ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లలో అదనంగా 20 శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. ఈ చర్యతో ఓవరాల్ కేటాయింపులు 50 శాతానికి చేరుకున్నట్టయింది. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియం శాఖ కార్యదర్శి లేఖ రాశారు.వాణిజ్య సిలిండర్లకు సంబంధించి హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీ ఆహార కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది. ఆహార కేంద్రాలకు ఎలాంటి లోటు లేకుండా చూడాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించింది. చమురు కంపెనీల వద్ద రిజిస్టర్ అయిన వాణిజ్య సంస్థలతో పాటు పీఎన్‌జీ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికి ఈ అదనపు కేటాయింపులు వర్తిస్తాయని తెలిపింది.

వలస కూలీలకు 5 కిలోల సిలిండర్లు అందజేయాలని, వాటిని సరఫరా చేస్తామని సూచించింది. ఎల్లుండి నుంచి సిలిండర్లు పంపిణీ చేస్తామని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రాసిన లేఖలో కేంద్రం తెలిపింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని ఆదేశించింది.

# పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కి పెంపు..

## సానుకూలంగా ప్రభుత్వం!

**అమరావతిమార్చి 21 ఆంధ్ర ప్రగతి**

ఏపీలోని ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. వీరి పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

ఈ అంశంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణలతో కూడిన కమిటీ ఇప్పటికే సమావేశమైంది. పదవీ విరమణ వయసు పెంపునకు ఈ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, 9, 10 షెడ్యూల్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించి, మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వయసు పెంపు వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం వంటి అంశాలను కూడా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి, ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# ఏపీలో త్వరలోనే నంది అవార్డుల పునఃప్రారంభం

**అమరావతిమార్చి 21 ఆంధ్ర ప్రగతి**

ఆంధ్రప్రదేశ్‌లో కొంతకాలంగా నిలిచిపోయిన ప్రతిష్ఠాత్మక నంది అవార్డులను త్వరలోనే పునఃప్రారంభిస్తామని రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటకం, సాంస్కృతిక శాఖల మంత్రి కందుల దుర్గేశ్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక ప్రకటన చేశారు. చలనచిత్ర, టీవీ, నాటక రంగాలకు చెందిన కళాకారులకు గౌరవం, గుర్తింపు అందించడంలో ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.విశాఖపట్నంలో సినిమా నిర్మాణానికి అనువైన లొకేషన్లు ఎన్నో ఉన్నాయని, వాటిని ప్రోత్సహించి నిర్మాణ సంస్థలను ఇక్కడికి ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేశ్ వివరించారు. కూటమి ప్రభుత్వం కళాకారుల అభివృద్ధికి, సినిమా రంగం బలోపేతానికి కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. నంది అవార్డుల ప్రదానోత్సవానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉద్ఘాటించారు.ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల కార్యక్రమంలో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ... కళాకారులను ప్రోత్సహించడంలో పొరుగు రాష్ట్రమైన ఏపీ కొంత వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో తాజాగా మంత్రి కందుల దుర్గేశ్ నంది అవార్డులపై ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నంది నాటకోత్సవాలను కూడా తెలుగు సంస్కృతి ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా ప్రకటనతో తెలుగు సినీ, నాటక రంగాల్లోని కళాకారుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. అవార్డుల ఎంపిక ప్రక్రియ, జ్యూరీ కూర్పు, దరఖాస్తుల ఆహ్వానం వంటి పూర్తి వివరాలు త్వరలోనే అధికారికంగా వెలువడతాయని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి.

# 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కోరుతూ అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ బిల్లు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

వచ్చే శుక్రవారం అసెంబ్లీలో తాము 'ప్రైవేట్ మెంబర్ బిల్లు' ప్రవేశపెట్టబోతున్నామని, దీనికి అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నామని వెల్లడించారు.సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన రోజే 6 గ్యారెంటీల ఫైలుపై సంతకం చేశారని, గవర్నర్ ప్రసంగంలో కూడా ఇదే చెప్పించారని... కానీ ఇప్పుడు ఆ ఫైలు ఎక్కడుందో తెలియడం లేదని కేటీఆర్ ఆరోపించారు. ఈ బిల్లు చట్టంగా మారితే... మహిళలకు రావాల్సిన రూ.2,500, రైతులకు రూ.15,000 రైతు భరోసా, విద్యార్థులకు విద్యా భరోసా వంటివి ప్రజల హక్కుగా మారుతాయని, ప్రభుత్వం ఎగ్గొట్టే అవకాశం ఉండదని స్పష్టం చేశారు.

గతంలో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో కూడా బీజేపీ ప్రవేశపెట్టిన ప్రైవేట్ బిల్లును ఆమోదించి చట్టం చేసిన దాఖలాలు ఉన్నాయని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఆరు గ్యారెంటీల్లో కనీసం 'అర' గ్యారెంటీ కూడా సరిగ్గా అమలు కాలేదని, 4 కోట్ల మంది ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తోందని ఎద్దేవా చేశారు.

# శ్రీవారి పవిత్రతే ప్రధాన లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.



## తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం

### ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు

తిరుమలలోని పిండి మర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 'వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్' ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. సుమారు రూ.25 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రెండు అంతస్తుల్లో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. ల్యాబ్‌లో సుమారు 50 రకాల అత్యాధునిక యంత్రాలను అమర్చారు, ఇవి ఆహార పదార్థాల్లోని అతి సూక్ష్మమైన లోపాలు కూడా గుర్తించగలవు. భక్తులకు అందించే అన్నప్రసాదాలు , లడ్డూ ప్రసాదాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీటీడీ చైర్మన్, ఈవోతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల పర్యవేక్షణ కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' ప్రాధాన్యతను సీఎం వివరించారు. పారిశుద్ధ్యం నుంచి భద్రత వరకు ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# ఇరాన్ అణు కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి

మొదటిపేజీ తరువాయి

2వేలమందికి పైగా మరణించారు. కేవలం లెబనాన్‌లోనే వెయ్యిమందికి పైగా మృతి చెందారు. పది లక్షల మందికి పైగా నిర్వాసితులయ్యారు. బీరుట్‌లోని హిజ్బుల్లా స్థావరాలే లక్ష్యంగా తాము దాడులు జరుపుతున్నామని ఇజ్రాయిల్ ప్రకటించింది. వచ్చే వారం ఈ దాడులు మరింత గణనీయంగా, ఉధృతంగా మారతాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. మరోవైపు పశ్చిమాసియాకు వేలాదిమంది నావికా బలగాలను అమెరికా పంపుతోంది.

**ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేస్తున్నాం**

యుద్ధం వల్ల స్తంభించిన ఇరాన్ చమురు అమ్మకాలను అనుమతించేందుకు వీలుగా 30రోజుల పాటు ఆంక్షలు రద్దు చేస్తున్నట్లు వైట్‌హౌస్ ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిలో నిలిచిపోయిన చమురు ట్యాంకర్లలోని చమురును విక్రయించుకోవడానికి వీలుగా ఇరాన్‌పై గల నిషేధాన్ని ఎత్తివేస్తున్నామని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ప్రకటించారు. రెండు వారాల్లో ఇలా తాత్కాలికంగా అమెరికా ఆంక్షలు ఎత్తివేయడం ఇది మూడవసారి. గతంలో రష్యా చమురుపై కూడా ఆంక్షలను సడలించింది.

కాగా ఈ ప్రకటనపై ఇరాన్ వెంటనే స్పందించింది. అమెరికా ప్రకటనని ఖండించింది. ప్రస్తుతం సముద్ర రవాణాలో తమ చమురు నిల్వలేవీ స్తంభించలేదని పేర్కొంది. అంతర్జాతీయ మార్కెట్‌కు సంబంధించి అందుబాటులో వున్న మిగులు చమురు నిల్వలేవీ ఇరాన్ వద్ద లేవని మహారాష్ట్రలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ఎక్స్ పోస్టులో తెలిపింది.

**ముందు యుద్ధం ఆగాలి**

హార్ముజ్ జలసంధి ధ్వారా నౌకల రవాణా నిలిచిపోవడంతో ముడి చమురు సరఫరా ఆగిపోయి పలు దేశాల్లో ఇబ్బందులు తలెత్తాయి. చమురు ధరలు 50శాతం మేరా పెరిగాయి. ఈ నేపథ్యంలో హార్ముజ్ ద్వారా నౌకల రాకపోకలు సురక్షితంగా జరిగేలాచూడాలని, తమ దేశ నౌకలను అనుమతించాలని 22 దేశాలు ఇరాన్‌ను అభ్యర్థించాయి. అలాగే ఇరాన్ చమురు క్షేత్రాలను, నౌకలను టార్గెట్ చేయడాన్ని ఖండించాయి. యుద్ధ చర్యలు ప్రపంచ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందని యుఎఇ విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దీనిపై 22 దేశాల నేతలు సంతకాలు చేశారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభించడానికి ముందు తమని మాట మాత్రంగానైనా సంప్రదించలేదని ఈ దేశాలు ఇప్పటికే పేర్కొన్నాయి. తాజాగా పరిస్థితులు ఇబ్బందికరంగా మారిన నేపథ్యంలో ఈ దేశాలు ముందుకొచ్చాయి. అయితే వీటన్నింటికంటే ముందుగా యుద్ధం తక్షణమే నిలిచిపోవాలని జర్మనీ, ఫ్రాన్స్ స్పష్టం చేస్తున్నాయి. ముందుగా అది జరిగితేనే తర్వాత ఏ చర్యలైనా చేపట్టడానికి వీలు వుంటుందని పేర్కొంటున్నాయి. ఈ వారాంతంలో ట్రంప్‌తో మాట్లాడనున్నట్లు జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్‌రిక్ మెర్జ్ చెప్పారు. కాగా హార్ముజ్ గుండా జపాన్‌కు సంబంధించిన నౌకలు వెళ్ళడానికి ఇరాన్ అనుమతించడానికి సిద్ధంగా వుందని క్యోడో వార్తా సంస్థ శనివారం తెలిపింది.

**ఇరాన్‌లో లక్ష్యాలు దాదాపుగా సాధించాం : ట్రంప్**

ఇరాన్‌పై సాగించిన యుద్ధంలో తమ లక్ష్యాలను దాదాపుగా సాధించామని ట్రంప్ చెప్పుకున్నారు. ఇరాన్ సైనిక పాటవాన్ని నిర్మూలించడం, అణ్వాయుధాన్ని అభివృద్ధిపరచకుండా అడ్డుకోవడం తమ కీలక లక్ష్యాలని వాటిని నెరవేర్చామని చెప్పారు. అందువల్ల ఇరాన్‌లో యుద్ధాన్ని ముగించే విషయమై ఆలోచిస్తున్నట్లు తెలిపారు. ఇరాన్ విషయంలో ట్రంప్ పలురకాలుగా ప్రకటనలు చేస్తున్నారు. ఒకపక్క పశ్చిమాసియాకు 2500మంది అదనపు నావికులను పంపిస్తున్నారు.మరోవైపు యుద్ధం కోసం అదనంగా నిధులు కావాలని కాంగ్రెస్‌ను కోరుతున్నారు. వీటన్నింటికీ మించి ఇరాన్‌పై ఇక యుద్ధాన్ని ముగిస్తామంటున్నారు. పైగా హోర్ముజ్ జలసంధిని పరక్షించుకోవాల్సిన బాధ్యత నాటో దేశాలదేనని, అమెరికాకు దానితో సంబంధం లేదని వ్యాఖ్యానించారు.

హిందూ మహా సముద్రంలోని అమెరికా, బ్రిటన్ సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాను ఇరాన్ లక్ష్యంగా చేసుకోవడాన్ని బ్రిటన్ ఖండించింది.

# నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

**విశాఖపట్టణం,మార్చి 21 ఆంధ్ర ప్రగతి**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఉక్కు కర్మాగారం కోసం సోమవారం సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామిలు శంకుస్థాపన చేయనున్నారు.ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి. గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం, వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ఇలా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు పడింది. ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతుంది. గత 21 నెలల కూటమి ప్రభుత్వ కృషితో ఈ భారీ ప్రాజెక్టు సాకారం కాబోతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఈ ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చేయనుంది.

# యుద్ధం ముగిస్తాం

మొదటిపేజీ తరువాయి

ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు.

ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

# ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్



**న్యూఢిల్లీమార్చి 21 ఆంధ్ర ప్రగతి**

ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలం పశ్చిమ ఆసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందని ఆశాభావం మోడీ వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో మోడీ ఇరాన్‌లో కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తాయని నొక్కి చెప్పారు. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, షిప్పింగ్ మార్గాలు తెరిచి సురక్షితంగా ఉండేలా చూడాలని దాని ప్రాముఖ్యతను మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
ఆదివారం 22 మార్చి 2026

# నంద్యాల జిల్లాలో ఘనంగా ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 21:**
భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులు. అల్లాకు కృతజ్ఞతలు తెలిపే పర్వదినమే ఈద్-ఉల్-ఫితర్ అని పేర్కొన్న ఇమాముల సంఘం జిల్లా అధ్యక్షులు అంజద్ భాష సిద్ధికి,నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పండుగ వేడుకలు అత్యంత భక్తిభావంతో, సోదరభావంతో మిన్నంటాయి. పవిత్ర రంజాన్ మాసం ముగిసిన సందర్భంగా, ముస్లిం సోదరులు జిల్లాలోని అన్ని ఈద్గాహ్‌లు మరియు మసీదులలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.నెల రోజుల పాటు అత్యంత నిష్ఠతో ఉపవాస దీక్షలు (రోజా) చేపట్టిన ముస్లింలు, నిన్న సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో నేడు పండుగను ఘనంగా జరుపుకున్నారు.నంద్యాల పట్టణంలోని ప్రధాన ఈద్గా వద్ద వేల సంఖ్యలో ముస్లింలు చేరి 'నమాజ్-ఎ-ఈద్' నిర్వహించారు. అల్లాహ్ కరుణాకటాక్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నంద్యాల సాయిబాబా నగర్ ఈద్గానందు ఇమాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాష ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ నిర్వహించారు ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాష మాట్లాడుతూ.. "ఈద్ ఉల్ ఫితర్ అనేది అల్లాకు కృతజ్ఞతలు తెలిపే గొప్ప పవిత్రమైన రోజు. ఇస్లాం మతం సర్వ మానవాళి హితాన్ని కోరుతుంది. ఆనందాన్ని పంచుకోవడం, సోదరభావాన్ని పెంపొందించడమే ఈ పండుగ యొక్క అంతరార్థం" అని పేర్కొన్నారు.హిందూ-ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకోవడం ద్వారా మత సామరస్యాన్ని చాటిచెప్పారు.పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం మరియు పోలీసు శాఖ వారు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పేదలకు 'ఫిత్రా' (దానం) పంపిణీ చేయడంతో జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



## రంజాన్ ఈద్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూమా.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 21:**
ముస్లిం సోదర సోదరీమణులందరికీ పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు. నెల రోజుల పాటు భక్తి శ్రద్ధలతో కఠిన ఉపవాస దీక్షలు ఆచరించి, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో పవిత్ర రంజాన్ నెలను విజయవంతంగా ముగించుకోవడం ఎంతో ఆనంద దాయకం. ప్రవక్త మహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చూపిన మార్గాన్ని అనుసరిస్తూ, జకాత్ ద్వారా అవసరంలో ఉన్న సాటి వారిని ఆదుకోవడం ముస్లిం సమాజంలోని మానవత్వానికి గొప్ప నిదర్శనం. అల్లాహ్ కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు నిండాలని కోరుకుంటూ నంద్యాల భీమవరం రోడ్డులోని ఆల్వార్ ఖాన్ ఈద్గాహ్ వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



## నంద్యాల సీనియర్ అడ్వకేట్ బొల్లెద్దుల రవికుమార్‌కు కీలక బాధ్యత..!

### ..వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియామకం.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 21:**
నంద్యాల జిల్లా రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది.జిల్లాలో బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన నేత,సీనియర్ అడ్వకేట్,మాజీ గవర్నమెంట్ ప్లీడర్ అయిన బొల్లెద్దుల రవి కుమార్ ను రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమించారు.ఈ మేరకు పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించింది. ఈ నియామకం పట్ల ఆనందం వ్యక్తం చేసిన రవికుమార్,పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు.పార్టీ బలోపేతానికి,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తనపై విశ్వాసం ఉంచిన మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి,మా గురువు,పెద్దాయన మాజీ మంత్రి శిల్పా మోహన్




రెడ్డికి,నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డికి,అలాగే వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు,పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.
పార్టీ వర్గాలు తెలిపిన ప్రకారం,న్యాయవాదిగా మరియు ప్రజా సమస్యలపై సుదీర్ఘ అనుభవం కలిగిన రవికుమార్ నియామకం ద్వారా నంద్యాల జిల్లా సహా రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ప్రచార కార్యక్రమాలు మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
ఇకపై పార్టీ విధానాలు,సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం,గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను సమర్థంగా ముందుకు తీసుకెళ్లడం తన ముఖ్య బాధ్యతలుగా భావిస్తున్నట్లు రవికుమార్ పేర్కొన్నారు.
అదేవిధంగా రంజాన్ పండుగ వేళ రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీ సోదరులందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎద్దుల పోటీలను ఎద్దుల పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.





**ఆంధ్ర ప్రగతి గోస్పాడు మార్చి 21:** శనివారం నాడు గోస్పాడు మండలం సాంబవరం గ్రామం లో అంకాలమ్మ తిరునాళ్ల సందర్భంగా గ్రామ వాల్మీకి సంగం నాయకులు మరియు గ్రామ పెద్దలు సోమ మద్దిలేటి రెడ్డి , శిరన్నగారి ఆదినారాయణ గార్ల ఆహ్వానం మేరకు ఎద్దుల పోటీలను నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాంపల్లె రామిరెడ్డి,వెన్నపూస విశ్వేశ్వరరెడ్డి, మంచాల భాస్కరరెడ్డి, అవినాష్ రెడ్డి, జయసింహారెడ్డి, తిమ్మారెడ్డి, వెంకట నాయుడు, వెంకటేశ్వర్లు, మధు బాబు, నరసింహ, కృష్ణ మరియు భూమా అభిమానులు, గ్రామ టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నంద్యాల అల్వార్ ఖాన్ ఈద్గాలో ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు

### ..పాల్గొన్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చ్ 21:**
నంద్యాల పట్టణంలోని భీమవరం రాస్తాలో ఉన్న అల్వార్ ఖాన్ ఈద్గా మైదానంలో పవిత్ర రంజాన్ పండుగ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. నెల రోజుల పాటు నిష్టతో పాటించిన ఉపవాస దీక్షలు విరమించి, ముస్లిం సోదరులందరూ ఈద్గా వద్ద ప్రత్యేక ఈద్ నమాజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి మరియు సోదరభావానికి ప్రతీక అని అన్నారు. నంద్యాల జిల్లా ప్రజలందరూ కులమతాలకు అతీతంగా, ఐకమత్యంతో సుఖసంతోషాలతో, శాంతి సమృద్ధులతో వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు. నమాజ్ అనంతరం అక్కడకు చేరుకున్న ముస్లిం



సోదరులను ఆలింగనం చేసుకొని, పరస్పరం "ఈద్ ముబారక్" తెలుపుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ముస్లిం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మునియార్ ఖలీల్ , స్థానిక ముస్లిం మత పెద్దలు, యువకులు మరియు భారీ సంఖ్యలో మైనారిటీ ప్రజలు పాల్గొన్నారు.



## గరికపాటిపై తీవ్రంగా మండిపడ్డ ఎంవీఆర్పీఎస్ మరియు బీసీ నేతలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 21:**
గరికపాటి నరసింహ రావ్ పేద విద్యార్థుల మధ్యాహ్న భోజనం బుక్స్,బ్యాగ్స్,ఎగ్స్ పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ నంద్యాల గాంధీ చౌక్ లోని గాంధీ విగ్రహం ముందు తీవ్ర నిరసన తెలుపుతూ రెండు రోజుల్లో బేషరతుగా క్షమాపణ చెప్పాలని చెప్పకుంటే అతన్ని అడ్డుకొని తీరుతామని అతని ఫొటోకు నిప్పంటించే ప్రయత్నం చేయగా పోలీస్ వారి విజ్ఞప్తిని గౌరవించి నిప్పుపెట్టకుండా మానుకున్నారు. ఈ



కార్యక్రమంలో మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజాసమితి రాష్ట్ర అధ్యక్షులు బోయపులికొండన్న,బీసీ సంక్షేమ సంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమ్మరి ప్రసాద్,మహర్షి వాల్మీకి రిజర్వేషన్ ప్రజా సమితి మహిళా రాష్ట్ర నాయకురాలు బోయ భారతి,ఎంవీఆర్పీఎస్ యూత్ జిల్లా నాయకులు పరమేష్,యూత్ నాయకులు నిఖిల్,నగేష్,సుంకన్న,మండల నాయకులు కుమార్,శేఖర్,ఉద్యోగ సంగనేత రవి,శివ,సూరి,సూర్య ,మద్దిలేటి తో పాటు 50 మంది నేతలు పాల్గొన్నారు.

## శిల్పా మోహన్ రెడ్డిని కలిసిన బొల్లెద్దుల రవి కుమార్.

### ..రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 21:**
నంద్యాల పట్టణానికి విచ్చేసిన మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డిని,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి బొల్లెద్దుల రవి కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల తనకు వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి పదవిని అప్పగించినందుకు శిల్పా మోహన్ రెడ్డికి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ..పార్టీ పట్ల తన నిబద్ధతతో మరింత చురుకుగా పనిచేస్తానని,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో




శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని చెప్పారు.మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి మాట్లాడుతూ..రవి కుమార్ పార్టీకి విశ్వసనీయంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పార్టీకి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే గంగుల బీజేంద్రా రెడ్డి నివాసంలో ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు.

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల మార్చి 21:**
నెల రోజుల పాటు పవిత్ర హృదయంతో నియమ నిష్టలతో పాటించిన ఉపవాస దీక్షలు విరమించిన యువత పెద్ద ఎత్తున అళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి నివాసం వద్దకు దొర్నిపాటి ఇజాజ్ ఆధ్వర్యంలో వెళ్లి ఈద్-ఉల్-ఫితర్ వేడుకలలో భాగంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ రంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి ఐక్యతకు శాంతి సౌఖ్యానికి మరియు సోదరభావానికి ప్రతీక అని అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని ప్రజలందరూ కులమతాలకు అతీతంగా, ఐకమత్యంతో సుఖసంతోషాలతో, శాంతి సౌక్యంతో వర్ధిల్లాలని అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గంగుల నాని నివాసానికి చేరుకున్న డి ఇజాజ్ ఆధ్వర్యంలో ముస్లిం యువతను ఆలింగనం చేసుకొని, పరస్పరం "ఈద్ ముబారక్" తెలుపుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేశారు.ఈ కార్యక్రమంలో బసాపురం అల్తామస్, షబ్బీర్, దొర్నిపాటి జియావు, సమీర్ యునైస్ తదితర యువకులు మరియు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# మానవత్వం లో ఆ అధికారి అందరివాడు..!

పవిత్రమైన రంజాన్ పర్వదినం సందర్భంగా పరిమళించిన మానవత్వం.

ముస్లిం మైనార్టీ సోదరులకువేల మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ.

నందికొట్కూరు, ఆత్మకూరు, ప్రాంతాలలో గూడ్స్& లైట్ గూడ్స్ వాహనా దారుల సహకారంతో సేవాభావం.

ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ. సత్యనారాయణ రెడ్డి.

ఆ అల్లా దీవెనలు ఆ సేవాకులకు ఉండాలంటూ మైనార్టీ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు.







**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు మార్చి 21:** శ్రమజీవుల కష్టాలను తెలుసుకొని అధికారంలో ఉంటూ ప్రతి కుటుంబానికి న్యాయం చేయాలనే ఆలోచనతో సోదరా భావం కలిగిన మానవత్వ దృపథంతో ఉపవాస ప్రార్థనలు పూర్తిచేసుకుని రంజాన్ పండుగ పర్వదినం వేడుకల సందర్భంగా శనివారం ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ. సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాలలో వేల మందికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ముందుగా ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల టర్నింగ్ సమీపంలో కుబ్రస్తాన్ కు ఎదురుగా మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు ముస్లిం మైనార్టీ సోదరులు తమ ప్రార్థనలు ముగించుకొని తిరుగు వెళ్లే క్రమంలో ప్రతి మైనార్టీ సోదరునికి మజ్జిగ ప్యాకెట్ అదేవిధంగా గూడ్స్& లైట్ గూడ్స్ వాహనా దారుల సహకారంతో నందికొట్కూరు పట్టణంలో ఈద్గా దగ్గర మైనార్టీ సోదరులకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సేవ భావంతో రంజాన్ పర్వదినం పురస్కరించుకున్న సందర్భంగా పలువురు మైనార్టీ సోదరులు హర్షం వ్యక్తం చేశారు ముఖ్యంగా ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ. సత్యనారాయణ రెడ్డి ఎంత హోదాలో ఉన్న అందరితో ప్రేమ అభిమానం పంచుతూ తన విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయకుండా తను చేసే ప్రతి పనిలో మంచితనం మానవత్వం చాటుకుంటూ ఆకలితో ఉన్న పేదవాడికి సహకారం అందిస్తూ ఇది నిర్వహణలో వాహనదారులకు రోడ్డు ప్రమాదాల జాగ్రత్తలు పాటించాలంటూ నియమ నిబంధనలు అమలు చేస్తూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ శ్రీశైలం పుణ్యక్షేత్రంలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పాదయాత్రికలకు వాహనాదారులకు ఘాటు రోడ్ లో వాహనాల నెమ్మదిగా వెళ్లాలంటూ సలహాలు సూచనలు చేస్తూ ఉగాది పర్వదినం సందర్భంగా మహారాష్ట్ర కర్ణాటక శ్రీశైలం వెళ్లే భక్తులకు అరటి పండ్లు బియ్యం ప్యాకెట్లు పంపిణీ చేసి వాహనాదారులకు తమదైన శైలిలో పలు సూచనలు అందించారు ఎప్పటికప్పుడు వాహనాల రికార్డులు తనిఖీలు చేస్తూ ప్రతి వాహనా దారుడికి లైసెన్సు, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్స్, తోపాటు ఇతర వాహన రికార్డులు అందుబాటులో ఉంచుకోవాలని వాహనాదారులకు తెలుపుతూ కష్టపడి పనిచేసే ప్రతి శ్రమజీవికి డ్రైవర్లకు కార్మికులకు వాహనదారులకు ఎంత హోదాలో ఉన్న... ఆ అధికారి మనందరి వాడు అంటూ మైనార్టీ సోదరులు తమ అభిమానాన్ని చాటుకున్నారు ఎన్నడూ లేని విధంగా సరికొత్త ఆలోచనలతో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి మైనార్టీ సోదరునికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ. సత్యనారాయణ రెడ్డికి నందికొట్కూరు ఆత్మకూరు ప్రాంత మైనార్టీ సోదరులు రంజాన్ పర్వదినం సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు

## మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి వాఖ్యలు సిగ్గుచేటు.

### పిల్లలకు క్షమాపణలు చెప్పాలి.

" గర్వమున కళ్ళు గానక తిరుగువాడు గోతిలో పడుట తథ్యము.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 21:** గరికపాటి నరసింహారావు పేద పిల్లలకు అందించే మధ్యాహ్నభోజన పథకంపై అహంకారపు అక్కసు వెళ్ళగక్కడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నంద్యాల జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుధీర్ కుమార్,ఎం.ఆర్.నాయక్ లు మాట్లాడుతూ

వాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయం. పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు "మిధ్య" అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. మధ్యాహ్న భోజనం పిల్లలు బడికి వచ్చేందుకు, డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. విద్యార్థులను "శోభనం పెళ్లికొడుకు"తో పోల్చడం విద్యార్థి లోకాన్ని కించపరచడం. భారతదేశంలో 84% మంది తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోడిగుడ్డును దానిని "గాడిద గుడ్డు" అని సంబోధించడం ఆకలిని కించపరచడం. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత. దానిని "బిచ్చం" అని పిలవడం సిగ్గుచేటు. గరికపాటి వ్యాఖ్యలు కనీస "విజ్ఞత లేనివి". ఏనాడయిన కార్పోరేట్లకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీల గురించి మాట్లాడని గరికపాటు పేద పిల్లలకు అందించే భోజనంపై విషం కక్కటం దుర్మార్గం. గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. పిల్లలను అవమానించిన గిరికపాటి నరసింహారవు క్షమాపణలు చెప్పాలి.

## కొత్తూరులో ఆలయ అభివృద్ధికి 50 వేలు విరాళం..!



**ఆంధ్ర ప్రగతి పాణ్యం/కొత్తూరు మార్చి 21:** ప్రముఖ శైవక్షేత్రం లక్షలాదిమంది భక్తుల ఆరాధ్య దైవమైన పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానము ఆలయము అభివృద్ధి నిమిత్తం భక్తులు 50 వేలు విరాళంగా శనివారం సమర్పించినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. పాణ్యం పట్టణమునకు చెందిన మాదాసు వెంకట చంద్రశేఖర్ బాబు సతీమణి విజయలక్ష్మి దంపతులు వారికి స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 50 వేలు విరాళంగా ఇచ్చారు, వారికి ఆలయ మర్యాదలతో శ్రీ స్వామివారికి అభిషేకము, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి, శేష వస్త్రములు, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో బేతంచెర్ల, పాణ్యం సిమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలక్రిష్ణ, ఉపాధ్యాయురాలు రాధిక, సిబ్బంది పాల్గొన్నారు.

## గడివేముల మూల పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు.

**ఆంధ్ర ప్రగతి గడివేముల మార్చి 21:** భక్తులు భక్తితో కొలిచే వారికి కోరికలు తీర్చే కల్పవల్లిగా ఏదిక్కు లేనివారికి తానే సర్వమని ఆదుకునే దేవతగా పేరుగాంచిన శ్రీ మూల పెద్దమ్మ తల్లి జాతర సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు వంగాల శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి బిడుదురు సీతారాం రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ పంట దిలీప్ కుమార్ రెడ్డి, పాణ్యం మార్కెట్ డైరెక్టర్లు షణ్ముఖ రెడ్డి, రమణారెడ్డి టిడిపి నాయకులు రమణారెడ్డి శ్రీ మూల పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు, కుంకుమ అర్చన, ఆకు పూజలు నిర్వహించారు. పూజ అనంతరం ఆలయ అధికారి టి హనుమంతరావు, ఆలయ చైర్మన్ దేశం రమణారెడ్డి, పూలమాలతో, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, పాడి పంటలతో, వర్షాలు సరైన ఒక సమయానికి కురిసి రైతుల సుఖసంతోషాలతో ఉండాలని మూల పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పంటరామచంద్రారెడ్డి,సుదర్శన్ రెడ్డి, పంట వంశీధర్ రెడ్డి, పంట మదిలేటి రెడ్డి,గణేష్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, భోగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కంది శ్రీనివాసులు, గిరిబాబు, మాజీ సర్పంచ్ జమాల్ బాషా, రీసెంట్ ఆర్మీ జమాల్ బాషా, కృష్ణారెడ్డి, భాస్కర్ రెడ్డి,నారాయణరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






## ధర్మాచరణముద్వారా పాపము నశిస్తుంది.

### డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే





**ఆంధ్ర ప్రగతి క్రిష్ణగిరి మార్చి 21:** మానవజాతి మనుగడకు ధర్మాచరణమే ఆధారమని, ధర్మాన్ని ఆచరిస్తే సమస్త పాపముల నుండి విముక్తుడవుతాడని, ఇహమునందు, పరమునందు సుఖ సంతోషాలతో వర్ధిల్లుతాడని, అటువంటి ధర్మాచరణ ప్రతి మానవుడి కర్తవ్యం కావాలని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి పిలుపునిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో క్రిష్ణగిరి మండలం, మన్నెగుంట గ్రామంలోని శ్రీ సుంకుల పరమేశ్వరి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలతో ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన ధార్మిక సభా కార్యక్రమంలో వారు ప్రవచించారు. స్వాత్మానందస్వామి మరియు తెలుగు పండితులు డాక్టర్ ఎం.మధుసూదనాచార్యులు చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్రమాలు భక్తులను పరవశింపచేశాయి. తిరుమల తిరుపతి దేవస్థానములనుండి ఏర్పాటు చేసిన ఈ ధార్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజలలో ఎంతో భక్తి భావనను కలిగించాయని భారతీయ జనతా పార్టీ క్రిష్ణగిరి మండల అధ్యక్షులు సి. రామలింగం కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధర్మప్రచారకులు బోయ వేంకటేశ్వర్లు, చిందుకూరి నడిపి వెంకటేశ్వర్లు, సి. రాముడు, కూరాకుల రాముడు, చిన్న హనుమంతు, పూల వెంకటేశ్వర్లు, పెద్దకురువ బజారి, కె. వెంకటేశ్వర్లు, పూజారి చిందుకూరి వెంకట రాముడు, బోయ చంద్రన్న, లక్ష్మీదేవి, వి.రాముడు, కె. సుంకన్న,కె. లచ్చప్ప, కె. నాగరాజు, మరియు భజన మండలి సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా అన్ని మసీదులు, ఈద్గాల వద్ద

# కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు







**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మార్చి 21:** నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు జిల్లాలోని పోలీసు అధికారులు మరియు సిబ్బంది మసీదులు ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది.

రంజాన్ పర్వదినం సందర్భంగా నంద్యాల జిల్లా ముస్లిం సోదర, సోదరీమణులకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలియ చేశారు.

జిల్లాలో ముస్లిం సోదరులు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పర్వదినం పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలలో భాగంగా మసీదులు, ఈద్గా ప్రార్థనా మందిరాలు/స్థలాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.

వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టారు. డ్రోన్ కెమెరాలతో కూడా నిఘా ఏర్పాటు చేశారు.

# సిరివెళ్లలో ఘనంగా ఈద్ అల్-ఫితర్ పండుగ.





**ఆంధ్ర ప్రగతి శిరివెల్ల మార్చి 21:**
సిరివెళ్ల పట్టణంలో ముస్లిం సోదరులు ఈద్ అల్-ఫితర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు.
ఒక నెలపాటు ఉపవాస దీక్షలు పాటించిన అనంతరం, ఈ రోజు ఉదయం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ప్రభాతకాలంలోనే భక్తులు కొత్త దుస్తులు ధరించి మసీదులకు చేరుకుని అల్లాహ్‌కు నమాజ్ సమర్పించారు.
పరస్పరం "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

**ప్రత్యేక ప్రార్థనలు మరియు సందేశం**
మత పెద్దలు ఈ సందర్భంగా శాంతి, సౌభ్రాతృత్వం, సహనం గురించి సందేశాలు ఇచ్చారు.
సమాజంలో అందరూ సఖ్యతగా జీవించాలని కోరారు.

**పేదలకు సహాయం**
ఈద్ పండుగకు ముందు భాగంగా "ఫిత్రా" రూపంలో పేదలకు దానం చేశారు. అవసరమైన వారికి ఆహారం, వస్త్రాలు అందజేసి సంతోషాన్ని పంచుకున్నారు.

**పండుగ వంటలు**
ఇళ్లలో ప్రత్యేక వంటలు తయారుచేశారు. ముఖ్యంగా సేమియా పాయసం (షీర్ ఖుర్మా), బిర్యానీ వంటి వంటకాలు తయారు చేసి బంధుమిత్రులతో పంచుకున్నారు.
స్నేహితులు, బంధువులతో ఆనందం పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు ఒకరినొకరు సందర్శించుకుని ఆనందంగా గడిపారు. చిన్నారులు కొత్త బట్టలు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు.
మొత్తం మీద, సిరివెళ్లలో ఈద్ పండుగ ఆనందోత్సాహాల మధ్య శాంతి, సౌహార్ద వాతావరణంలో ఘనంగా ముగిసింది.


## ఏపీలో రేషన్ షాపుల్లో మళ్ళీ కిరోసిన్ పంపిణీ.

**వచ్చే సోమవారం నుంచి లీటరు చొప్పున కిరోసిన్ పంపిణీ.**



**ఆంధ్ర ప్రగతి అమరావతి మార్చి 21:**హార్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్తతల ప్రభావంతో విశాఖపట్నానికి ఈ నెల 21వ తేదిన రావాల్సిన గ్యాస్ నౌక 26వ తేదిన చేరనున్నట్టు కేంద్రం సమాచారం ఇచ్చిందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. అప్పటి వరకు సరఫరాలో అంతరాయం లేకుండా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయని చెప్పారు. ప్రస్తుతం గ్యాస్ కొరత నేపథ్యంలో కేంద్రం కేటాయించిన 2800 కిలో లీటర్ల కిరోసిన్ ను వచ్చే సోమవారం నుంచి రేషన్ ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో లీటరు చొప్పున పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

## రాయలసీమ సాగునీటి ఉద్యమానికి తీరని లోటు.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 21:**రాయలసీమ సాగునీటి రంగ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన శ్రీ చైతన్య గంగిరెడ్డి మరణం, రాయలసీమ సాగునీటి ఉద్యమానికి తీరని లోటని.వారి సంస్మరణ సభలో వక్తలు భావోద్వేగంతో పేర్కొన్నారు.నంద్యాల ప్రధాన కార్యాలయంలో మార్చి 21, 2026 న నిర్వహించిన సంస్మరణ సమావేశంలో సమితి కార్యవర్గ సభ్యులు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతపురం మరియు రాయలసీమ సాగునీటి అభివృద్ధి కోసం ఆయన చేసిన విశేష సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలో నడుస్తూప్రతి రాయలసీమ ఉద్యమకారుడు "జలవందనం"తో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్దాం అని ప్రతిజ్ఞ చేశారు.
ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, కోశాధికారి చెరుకూరి వెంకటేశ్వర నాయుడు, కార్యదర్శి మహేశ్వర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మహబూబ్ బాషా, పట్నం రాముడు, రాఘవేంద్ర, అసదుల్లా, ప్రచార కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

# పశు పోషకులకు ఊరట

## రుసుములపై సడలింపులు జారీ -మంత్రి అచ్చన్నాయుడు వెల్లడి

**అమరావతి, మార్చి 21 ఆంధ్ర ప్రగతి**
పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపునిచ్చింది. భవన అనుమతుల రుసుములో సడలింపులు చేసింది. ఈ సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్నరైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక




ఫారాలకు బెటర్‌మెంట్, డెవెలప్‌మెంట్ ఛార్జీలు మినహాయింపునిచ్చినట్లు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ నిర్ణయంతో మరింత మందికి స్వయం ఉపాధి, సమృద్ధి లభిస్తుందని వెల్లడించారు. గత జూన్‌లో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# యుఎన్ఐ ఆఫీసు స్వాధీనం

### జర్నలిస్టులను బయటకు పంపిన పోలీసులు

### హైకోర్టు ఆదేశాలతో కేంద్రం నిర్ణయం

**న్యూఢిల్లీ,మార్చి 21 ఆంధ్ర ప్రగతి**
దేశ రాజధాని ఢిల్లీలో ఉన్న యునైటెడ్ న్యూస్ ఆఫ్ ఇండియా వార్తా ఏజెన్సీ యుఎన్ఐ ఆఫీసును శుక్రవారం రాత్రి మూసివేశారు. పారామిలిటరీ దళాలు, ఢిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆ ఆఫీసుపై దాడి చేశాయి. సుమారు 50 మంది జర్నలిస్టులను ఆ ఆఫీసు నుంచి బయటకు గెంటివేశారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టు ఆదేశాల ప్రకారం రఫీ మార్గ్‌లో ఉన్న యూఎన్ఐ ఆఫీసును పోలీసులు




స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం లాండ్ అండ్ డెవలప్మెంట్ ఆఫీసర్లకు రక్షణ కల్పించేందుకు యూఎన్ఐ సిబ్బందిని ఖాళీ చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ సచిన్ శర్మ తెలిపారు.అయితే తమకు ఎటువంటి నోటీసు ఇవ్వలేదని యూఎన్ఐ తన ప్రకటనలో తెలిపింది. బలవంతంగా ఆఫీసును ఖాళీ చేయించినట్లు ఆ సంస్థ ఆరోపించింది. కొందరు ఉద్యోగులను ఈడ్చుకెళ్లారని యూఎన్ఐ పేర్కొన్నది. న్యూస్ ఏజెన్సీకి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేయడంతో శుక్రవారం రాత్రి పోలీసుల యూఎన్ఐ ఆఫీసును సీజ్ చేశారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూఎన్ఐ ఆఫీసును ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ చర్య పత్రికా స్వేచ్ఛపై దాడిగా యూఎన్ఐ పేర్కొన్నది. నాలుగు దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిపై ఏజెన్సీ ఇంత వరకు నిర్మాణం చేపట్టలేదని హైకోర్టు తన తీర్పులో పేర్కొన్నది.1979 భూ కేటాయింపు చట్టం ప్రకారం భూమి తీసుకున్న రెండేళ్లలోనే నిర్మాణాన్ని చేపట్టాలి, కానీ యూఎన్ఐ ఆ పనిచేయలేదని హైకోర్టు వెల్లడించింది.

# ఫుడ్ సేఫ్టీలో అత్యాధునిక పరిశోధన శాల

## అక్రిడిటేషన్ వచ్చాక పూర్తిస్థాయి పరీక్షలు -వెల్లడించిన ఏపీ మంత్రి సత్యకుమార్

**తిరుమల,మార్చి 21 ఆంధ్ర ప్రగతి** కొద్దికాలం వ్యవధిలోనే తిరుమలలో ఫుడ్ సేఫ్టీ పరిశోధన శాలను ప్రారంభించామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పరిశోధనశాలలో అనేక పరీక్షలు చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పాలు, నెయ్యి, నూనెతో పాటు ముడి సరుకుల నాణ్యతను పరీక్షించవచ్చని చెప్పుకొచ్చారు. తిరుమలలో ప్రతిష్టాత్మకంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ల్యాబ్‌ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని 2024లో ఎఫ్ఎస్ఎస్ఏఐతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుందని తెలిపారు. విశాఖపట్నం,




గుంటూరు, తిరుపతిలో స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి అదనంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రస్తావించారు.

శనివారం తిరుమలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.25 కోట్లతో నిర్మించిన ఈ పరిశోధన శాలలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ పరిశోధన శాల పని చేస్తోందని వివరించారు. అప్పటి వరకు అనాలిసిస్ జరుగుతునే ఉంటుందని తెలిపారు. మూడు నెలల్లో గుంటూరు, వైజాగ్‌లో పరిశోధన శాలలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 11 స్టేట్ ఫుడ్ ల్యాబ్‌లను ఆధునికీకరించామని అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీపడ బోమని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

# మొన్న భార్య ...నేడు భర్త ఆత్మహత్య

## కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం

**కరీంనగర్,మార్చి 21 ఆంధ్ర ప్రగతి:**
కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో



వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు.చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పేద ముస్లిం కుటుంబానికి లోకేశ్ హామీ



**గుంటూరు,మార్చి 21 ఆంధ్ర ప్రగతి** గతేడాది పవిత్ర రంజాన్ సందర్భంగా పేద ముస్లీం మైనార్టీ సోదరుడికి ఇచ్చిన హామీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. రంజాన్ వేళ మంగళగిరి బస్టాండ్ సమీపంలో ఉండే షేక్ షహెన్నా ఇంటిని మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. అతడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి లోకేశ్ ఇఫ్తార్ విందు స్వీకరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా షహెన్నా నివసిస్తున్న ఇంటిని మంత్రి పరిశీలించి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ పూర్వీకులు నిర్మించిన రేకుల ఇంటి స్థానంలో నూతన ఇల్లు నిర్మించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు మంత్రి లోకేశ్‌ను కోరారు. షహెన్నా కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, నూతన గృహం నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఏడాది తిరగకముందే నూతన ఇంటిని నిర్మించి షేక్ షహెన్నా కుటుంబసభ్యులకు అప్పగించారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు

## డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమం

**విజయనగరం,మార్చి 21 ఆంధ్ర ప్రగతి**జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. రామభద్రాపురం మండలం తారాపురం వద్ద బస్సులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వెళ్తుండగా వెనుక టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక



టైర్ పేలి మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవర్.. వెంటనే ప్రయాణికులను దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉండగా.. ఎవరికీ ఏ గాయం కాలేదు. అయితే బస్సు మాత్రం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఒడిశాకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా ప్రయాణం చేస్తున్నట్లు సమాచారం.కాగా, బస్సు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ÷ర్ సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇక పోలీసులు కూడా ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులను ప్రత్యామ్నయ మార్గాల్లో గమ్యస్థానాలకు పంపించేశారు.